

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 19 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

తన ఆధీనంలో ఉన్న ముజ్జుగుడెం, ధరగిరిపురం, గోవులపల్లి, మొదలైన గ్రామాల పర్యవేక్షణ ముగించుకుని ముదిగొండ పొలిమేరలు దాటుతున్నాడు కృష్ణరాయలు. మరికొంతసేపటిలో సూర్యుడు పూర్తిగా కనుమరుగు కాబోతున్నాడు. ఆకాశపు అరుణిమను పోతపోసుకుని అమ్మవారి రథధ్వజపతాకలా ఎగురుతున్నది ఆయన ఉత్తరీయం. సిందూరప్రవాహంలా సాగుతున్నది ఆయన గుఱ్ఱం. నిలువెల్లా పూచిన కనకాంబరం గాలికి కదలాడుతున్నట్టు ఉన్నదా గుఱ్ఱం. ఆయన గుఱ్ఱపు వేగాన్ని అందుకోడానికి ప్రయత్నిస్తూ వెనుకనే వస్తున్నారు ఆయన సిపాయిలు నలుగురూ. గాలివాలుకు కూసుమంచి గణపేశ్వరాలయ గంటలు ఉండీ ఉండీ సన్నగా ఘల్లు ఘల్లుమని వినిపిస్తున్నాయి, ప్రదోషపూజ జరుగుతున్న సూచనగా.

క్రమక్రమంగా సిందూరవర్ణ చీనాంబరం విడిచి వంగపండు రంగు వలువను సింగారించుకుంటున్నది అంబరమనే అతివ. మెల్లమెల్లగా బూడిద రంగుకు, నల్లనిరంగుకు ఆకాశపు అంచులు మారుతున్నాయి. కాకతీయుల కరవాలాల కరకుధ్వనులు మ్రోగిన కదనరంగాలు, ముదిగొండ చాళుక్యుల చురకత్తుల పదునుమెరిసిన స్థలాలు చూస్తూ గుఱ్ఱపు వడికి అనుగుణంగా తను వంగుతూ, నిగుడుతూ వేగంగా సాగుతున్నాడు కృష్ణరాయలు.

అటునుండి ముజ్జుగుడెం బాలసాగరం మీదినుండి చల్లని గాలులు వీస్తున్నాయి, సేదదీరుస్తూ. యుగాల చరిత్రను కడుపులో దాచుకున్న భూమి, బౌద్ధం, జైనం, శైవం విలసిల్లిన పవిత్రభూమిని పరికిస్తూ సాగుతున్నాడు. నిరుదువిరిసి రాలిన విరులలా వీరుల శిరసులెన్ని ఈ

ధూళిలో పొరలాడాయో కదా అనుకున్నాడు. ఆయన మనసు ఒక క్షణకాలం బరువెక్కింది. రెండు ధనువుల దూరంలో వెనుక ఉన్నారు ఆయన సహచరులు.

ఒక నిట్టూర్పులా సన్నని ధ్వని చిన్ని బుసలా వినిపించింది. రికాబులలో కాళ్ళు తన్నిపట్టి, కళ్ళాలను ఒడిసిపట్టి స్వారీ చేస్తున్నాడు. చెంగున దూకుతూ సాగుతున్న గుఱ్ఱానికి అనుకూలంగా కొద్దిగా ముందుకు వంగిన క్షణంలో రివ్వున వచ్చిన బాణం ఆయన తలపాగాను ఎగురకొట్టింది. లిప్తలో గ్రహించాడు ఆయన. అంతకన్నా కొద్దిగా ముందే గ్రహించింది ఆయన గుఱ్ఱం. మంత్రపు గుఱ్ఱంలా దిశను మార్చుకుని ఎడమప్రక్కకు లంఘించింది. ఆయన కుడి భుజం మీదుగా మరొక బాణం దూసుకువెళ్ళింది. ఆయన గుఱ్ఱం తెలివిగా ఎడమప్రక్కకు దూకకుంటే ఖచ్చితంగా ఆయన గుండెల్లోకి దూసుకుపోయి ఉండేది! మంత్రం వేసినట్లు ఆయన ఎడమచేతిలోకి వచ్చింది రెండుఅడుగుల వ్యాసం ఉన్న డాలు. మూడు అడుగుల పొడవున్న విచ్చుకత్తి ఎప్పుడు కుడిచేతిలోకి వచ్చిందోగానీ, ఒక రక్షణకవచంలా గాలిలో తిరుగుతుంటే దాని పదును మాత్రమే మెరుస్తూ కనిపిస్తున్నది.

వెనుక వస్తున్న గుఱ్ఱాలముందు నేలకు నాటుకున్న మూడు బాణాలు సన్నని దుమ్ముతెరను లేపాయి. ఏం జరుగుతున్నదీ గమనించేలోపే ముందున్న గుఱ్ఱానికి మెడలో దిగిన బాణం తోలు పట్టీని చీల్చి రెండోప్రక్కన మొనతేలింది. పదిఅడుగులు పైకిలేచి పల్టీ కొట్టింది అది. రౌతు వడిసెలలో రాయిలా లేచి పొదలమధ్యనున్న బండరాతికి శిరసు తగిలి పడినవాడు యికలేవలేదు. మిగిలిన ముగ్గురు సిపాయిలు ఆసరికి దాడి జరుగుతున్న విషయం గమనించారు. మరుక్షణంలో కృష్ణరాయలకు రక్షణగా కుడిఎడమలకు ముందుకూ వచ్చాయి వారి అశ్వాలు.

అల్లంతదూరంలో గండశిలల మాటునుండి యమకింకరుల్లా నలుగురు ఆశ్వికులు ప్రత్యక్షమైనారు. మధ్యనున్న యిద్దరి చేతులలో విచ్చుకత్తులు, బరిశెలు ఉన్నాయి. అటూయిటూ ఉన్న ముష్కరుల చేతులలో కాలనాగుల్లా ధనుస్సులు మెరుస్తున్నాయి. ఆ వింటి అల్లెతాళ్ళు బుసకొడుతున్నట్లు ధ్వనులు చేస్తున్నాయి. కాటుకుసాచే కోరల్లా పదునైన బాణాలు వచ్చిపడుతున్నాయి. సమీపంనుండి ఆయనను ఎదిరించి నిలవడం సాధ్యంకాదని గతంలో తెలిసినవాళ్ళు బహుశా, దూరంనుండే పడగొట్టానికి విల్లంబులను ఎంచుకున్నారు!

రెండే రెండు క్షణాలలో తనవ్యూహం నిర్ణయించుకున్నాడు కృష్ణరాయలు. 'ప్రక్కలనుండి కమ్ముకోండి' అన్న ఆజ్ఞ వెలువడ్డది స్వచ్ఛమైన మరాఠీలో. ఆయన ప్రక్కనున్న యిద్దరి గుఱ్ఱాలు నల్లని మెరుపుల్లా అటూయిటూ పొదల్లోకి నల్లత్రాచుల్లా మెరిసి మాయమైనాయి. ముందున్న సిపాయీ చేతిలో బల్లెం బాణాకర్రలా వృత్తాకారంలో ఏటవాలుగా మెరుస్తూ తిరుగుతున్నది. దాని వడికి రివ్వున గాలి చేసే ధ్వనులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. చక్రంలా తిరుగుతున్న ఆ బల్లానికి తగిలి ఖంగుమంటూ బాణాలు ప్రక్కలకు పడుతున్నాయి. మూడు నిముషాలు కొనసాగింది ఆ రక్షణావలయం.

తన ముందున్న సైనికుడిని అడ్డుపెట్టుకున్న కృష్ణరాయలు క్షణంలో గుఱ్ఱాన్ని అదుపులోకి తెచ్చుకున్నాడు. సూటిగా ముందుకు దూకించాడు గుఱ్ఱాన్ని వారివైపుకు. పది ధనువుల దూరంలో ఉన్నవారి ఆకారాలు లీలగా కనిపిస్తున్నాయి. మధ్యలోనున్న వ్యక్తి భుజానికి వ్రేలాడుతూ లీలగా కనిపిస్తున్న నాటు తుపాకీమీద ఉన్నది ఆయన దృష్టి. అది పైకి లేవడం రెండుచేతులతో దాన్ని బరువుగా ఎత్తడం కనిపిస్తున్నది. చిన్ని మూలుగుతో ముందున్న సిపాయీ ముందుకు వాలిపోయాడు గుఱ్ఱం మీదికి. అతని గుండెలోనుండి దూసుకుని వీపుపైన తేలింది పదునైన బాణం ఒకటి. దానితో అటువైపు అమ్ములపొదులు ఖాళీ ఐనట్లున్నాయి. కరవాలాలు దూసి గుఱ్ఱాలను ముందుకు దూకించడం కనిపిస్తున్నది మసకమసకగా.

యింతలో ప్రక్కలనుండి రెండు గుర్రాలమీద వారిమీదికి దూకుతున్న తన సిపాయీలు యిద్దరు కనిపించారు.

ఎక్కడినుండి వచ్చిందో పరశురామునిబాణంలా ఒకటి నాటుతుపాకీని పైకిలేపిన మణికట్టును ఖండించింది! నేలకు పడుతున్న తుపాకీ పేలిన ధ్వని చుట్టుప్రక్కల చెట్లమీదికి చేరుతున్న పక్షులను కలకలంతో ఎగిరేలా చేసింది. ఎర్రటి నిప్పుముద్ద ఒకటి ముందున్న సైనికుడి గుఱ్ఱాన్ని పదిఅడుగులఎత్తుకు లేపి గుడ్డబంతిని విసిరినట్టు విసిరేసింది. తుపాకీని మణికట్టును కోల్పోయిన ఆకారం గుఱ్ఱాన్నిరివ్వున వెనక్కుతిప్పి తిప్పి బండరాళ్లచాటుకు మాయమైంది. రెండవ గుఱ్ఱం మీది వ్యక్తి ఆతడి వెనుకనే మాయమైనాడు. ఆసరికి అక్కడికి చేరుకున్న కృష్ణరాయలు వారించేలోపే బాణాలు ప్రయోగించినవారు కృష్ణరాయల సైనికులచేతిలో హతులైనారు. తలలు తెగి నేలమీదికి పడిపోయిన ఆకారాలను చూసి పెదవి విరిచాడు కృష్ణరాయలు నిరాశగా. ఒక్కడినైనా ప్రాణాలతో పట్టుకోవాలి అనుకున్న ఆయన ఆలోచన విఫలమైంది! పోరాటంలో తగిలిన గాయాలను లెక్కచేయకుండా ఆయనను సమీపించిన సైనికులిద్దరు ఆయన క్షేమంగా ఉన్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటే కృష్ణరాయల దృష్టి వారిమీద లేదు, వారి వెనుకవైపునుండి నిదానంగా అడుగులేస్తూవస్తున్న గుఱ్ఱం మీద ఉన్నది. దానిమీది ఉద్ధవుడి ఆకారం మత్స్యయంత్రాన్ని భేదించిన పార్థుడిలా ఉన్నది!

## 20

'రాంప్యారీ', ఉద్ధవుడు వెళ్ళినవైపు చిరునవ్వుతో చూసి సాయంకాల విధులకు బయలుదేరాడు సమర్థుడు. మున్నేటికి స్నానానికి బయల్దేరాడు. యిద్దరు శిష్యులను మాత్రమే తనవెంట అనుమతించాడు. మిగిలినవారిని మహలును కనిపెట్టుకుని ఉండాలని నిర్దేశించాడు. అప్పటికింకా పూర్తిగా చీకట్లు అలుముకోలేదు. మరొక పది పదిహేను నిముషాలలో పూర్తిగాపగటి వెలుతురు అంతరించిపోతుంది. మహలునుండి దాదాపు పావుక్రోసు దూరం ఉంటుందేమో మున్నేటి రేవుకు. గ్రామకూడలి కేంద్రం రచ్చబండ. విశాలమైన రావిచెట్టు చుట్టూ వేదిక. గ్రామస్తులకు రచ్చబండ కబుర్లకువేదిక. ఆయనను చూడగానే రచ్చబండవద్ద చేరినవారు నమస్కరిస్తూ నిలుచున్నారు భక్తిప్రపత్తులతో. ప్రసన్నదృక్కులతోనే వారిని ఆశీర్వదిస్తూ వడిగా రేవువైపు అడుగులేశాడు సమర్థుడు.

సగందూరము నుండి బాటకు యిరువైపులా ఉన్న పెద్దపెద్ద వృక్షాలస్థానంలో పొదలు, పెద్దపెద్ద శిలలు ప్రత్యక్షమవుతున్నాయి. సాయంకాలపు అరుణవర్ణంలో కాషాయపు ముసుగులేసుకున్న కపటసన్యాసుల్లా ఉన్నాయి. మున్నేటిగలగలలు లీలగా వినిపిస్తున్నాయి. ఆవలిఒడ్డున ఎడమప్రక్కన మసకమసకగా స్థంభాద్రి నృసింహుని దేవాలయగోపురం కనిపిస్తున్నది. కుడిప్రక్కన స్తంభాద్రి రాతికోట మహాభూతంలా కనిపిస్తున్నది. రేవును సమీపిస్తున్నకొద్దీ గాలివాలుకు కోటలోని గుఱ్ఱాల హేషలు సన్నగా వినిపిస్తున్నాయి. యింకా స్పష్టంగా ఉద్ధవుడు వెళ్ళిన పడమరదిశలో గుఱ్ఱాల హేషలు వినిపిస్తున్నాయి. రేవుకు ఆవల, తూర్పువైపునుండి వినిపిస్తున్న హేషలకు వీటికి తేడా స్పష్టంగా తెలుస్తున్నది. అడుగుదూరంలో ఆయనను అనుసరిస్తున్న శిష్యులు కళ్యాణుడు, చిన్నగోవిందుడు అది గమనించినట్టున్నారు. ఒకింత ఉద్విగ్నతతో ముఖాలు చూసుకున్నారు.

ఉద్ధృతంగా లేచిన పెనుకెరటంలా వడివడిగా అడుగులేస్తున్న సమర్థుని దృష్టి స్థంభాద్రి నృసింహుని ఆలయశిఖరం మీదనే ఉన్నది. యింతలో దిక్కులు పిక్కటిల్లేలా తుపాకీ పేలిన ధ్వని వినిపించింది. ఆ ధ్వనికి బాటకు కొద్దిగా దూరంగా ప్రక్కనున్న చెట్లమీదినుండి కలవరంతో పైకిలేచిన పక్షులు మరలా కొమ్మలమీదకు చేరుకున్నాయి. సమర్థరాముని అడుగులు ఆగిపోయాయి. ఒక్కఅడుగులో ఆయనను సమీపించి రెండుప్రక్కలా నిలిచారు కళ్యాణుడు, గోవిందుడు. ఆయన ముఖంలోకి చూశారు కంగారుగా. దండకమండలాలు పట్టుకున్న కుడిచేయి నడుముకు ఆనించి, ఏదో ఆలోచిస్తున్నట్లు

ఉన్నాడాయన. ఎడమచేయి వింటిని బిగించి పట్టిఉన్నది. మూపున అమ్ములపొది. మెడలో మేలిమి తామరపూసల మాలలు. కాషాయపు ఉత్తరీయం మున్నేటి చిరుగాలులకు ఎగురుతున్నది. సిందూరవర్ణపు త్రాచు పడగవిప్పినట్లున్నది.

డచ్ వారు, ఫ్రెంచ్ వారు, ఇంగ్లీష్ వారు అడుగుబెట్టడంతో అమరిన ఆయుధం తుపాకీ. మందుగుండు ఫిరంగులలో దట్టించడంతోనే ఆగిన భారతీయులకు అది అదనపు ఆయుధం. మామూలు సిపాయిలకు అప్పటికి అది అందుబాటులో లేదు. కనీసం మూడువేల సైనికులకు దళపతి ఐనవాడికే అందే ఆయుధం అది. కొంతసేపటిక్రితం ఛత్రపతి నుండి వచ్చిన లేఖలోని విషయం మెదిలింది ఆయన మనసులో. నాగోజీ జెధే బీజాపూర్ సేనాపతి హుసేన్ ఖాన్ మియా సవారీ చేస్తున్న ఏనుగు అంబారీ మీదకు సాహసించి తన గుఱ్ఱాన్ని దూకించాడు. దాని తొండాన్ని నరికి తీవ్రంగా గాయపరిచాడు. హుసేన్ ఖాన్ తన తుపాకీతో ఆ యువకిశోరాన్ని కాల్చి చంపాడు. ఆ స్థాయి సైనికులకు అందుబాటులో ఉన్న తుపాకీని పట్టుకుని కృష్ణరాయలమీదకు బయల్దేరిన వారిని తలచి గంభీరంగా తలపంకించాడు.

ఆయన పెదవులు ఉన్నట్టుండి చిరునవ్వుతో విచ్చుకున్నాయి. అయోమయంగా, ఆదుర్దాగా ఆయనను సమీపించిన శిష్యులచూపులు ఆయనపైన నిలిచాయి. ఆయన చూపులుమాత్రం బాటకు యిరుప్రక్కలా గంభీరంగా నిలిచిన గండశిలలచాటునుండి ఆయుధాలతో కమ్ముకుంటున్న ఆగంతకులమీద నిలిచాయి. అటు నలుగురు, యిటు నలుగురు ఎనిమిదిమంది రాక్షసుల్లా ఎదుటపడ్డారు. ఆయన చూస్తున్న వైపు చూసి శిష్యులు నివ్వెరపోలేదు. నినదించారు 'జయజయ రఘువీర సమర్థా' అని!

కళ్యాణబా! ఎప్పుడూ ఘంటమేనా? నీచేతిలో ఖడ్గాన్ని చూసి చాలాకాలం ఐంది అన్నాడు సమర్థుడు, ముసిముసి నవ్వులు విరబూయిస్తూ. కళ్యాణుడి శరీర భాష మారిపోయింది. గురుదేవుడికి నమస్కరించి మూడు అడుగులు కొలిచినట్లు ప్రక్కకువేశాడు. బాట ప్రక్కకు అడుగులువేసి, ఎదురుచూస్తున్నట్లున్న రాతిమీద కూర్చున్నాడు సమర్థుడు.

ఊ! కదులు! అన్నట్లు తల ఊచాడు గోవిందుడిని చూస్తూ. అందుకోసమే ఎదురుచూస్తున్నట్లు నమస్కరించి తనూ ముందుకు అడుగులేశాడు చిన్నగోవిందుడు.

మహారాష్ట్ర అడవులలో కొండల్లో ఉండే పిండారీలను, ఆశ్రమాలమీద మఠాలమీద దాడులు చేసే బందిపోట్లను, మొగలాయీల సైనికులను ఎదుర్కొనడంకోసం, ఆత్మరక్షణ చేసుకొనడంకోసం తన మహంతులను, శిష్యులను అందరినీ యుద్ధవిద్యలలో నిష్ణాతులను చేశాడు సమర్థరాముడు. ఆయన తన ఇరవైనాలుగు సంవత్సరాల వయసులో మొదలుబెట్టి పన్నెండు సంవత్సరాలపాటు యావద్భారతాన్నీ పర్యటించాడు. మలబారు కొండలలో గిరిజనుల గెరిల్లా పద్ధతులను చూశాడు. ట్రావెంకూరు సైనికుల ప్రాచీన యుద్ధవిద్యలను పరిశీలించాడు. పాండ్య, చోళ, కళింగ, విజయనగర సామ్రాజ్యాల యుద్ధవిద్యలను, సాముగరిడీలను సన్నిహితంగా గమనించాడు. మధ్య, ఉత్తర, ఈశాన్య, తూర్పు ప్రాంతాల యుద్ధవిద్యలను గమనించాడు. అన్నింటినీ జోడించి, అవసరమైతే ఉత్తచేతులతోనే శత్రువులను ఎదిరించి, మట్టిగరిపించే యుద్ధవిద్యను రూపొందించాడు. ఛత్రపతి ఏటేటా నిర్వహించే వసంత, శరన్నవరాత్రుల ఉత్సవాలలో యుద్ధవిద్యల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణలు. వాటిలో ఎప్పుడూ సమర్థుని 'మహాబలి' బృందాలదే ప్రథమ స్థానం. ఛత్రపతి సమర్థుని తన గురువుగా ఎంచుకున్న తర్వాత ప్రత్యేక బృందాలను సమర్థుని వద్దకు పంపేవాడు ఆ విద్యలలో శిక్షణకోసం. ఉద్ధవుడు, కళ్యాణుడు, చినగోవిందుడు, వీరభద్రుడు ఆ శిక్షణాశిబిరాలను వంతులవారీగా నిర్వహించేవారు. యిప్పుడు వీరభద్రుడు మహల్ వద్ద ఉన్నాడు, కృష్ణరాయల కోటలోని సైనికులకు తోడుగా. ఉద్ధవుడు కృష్ణరాయల రక్షణ నిమిత్తం వెళ్లిఉన్నాడు. కళ్యాణుడు, చిన్న గోవిందుడు గురువుగారికి కనువిందు చేయడానికి కదనరంగంలోకి దిగారు.

ఏ సైన్యం అయినా ఒక నాయకుడి కనుసన్నలలో నడుస్తుంది. వారి ధైర్యం ఆ నాయకుడిని చూసుకునే హెచ్చు తగ్గులకు లోనవుతుంది. నాయకుడిని పడగొడితే అనుచరులు బిక్కబీటుగా నేలకు పడిపోతారు. ఎదుటనిలిచిన ఎనిమిదిమందిలో శిరస్త్రాణం, దుస్తులు బట్టి ముఖ్యుడు అనుకున్నవాడిమీద దృష్టి కేంద్రీకరించాడు కళ్యాణుడు. మొదటిదెబ్బ ఎవరు కొడతారు అనేది మరొక ముఖ్యవిషయం. తన అనుచరులను ముగ్గురిని సమర్ధుని వైపు కదలమని సంజ్ఞచేసి తను ముందుకు కదిలాడు వారిని నడిపిస్తున్నట్లున్న వ్యక్తి. యిద్దరు గోవిందుడివైపు, యిద్దరు కళ్యాణుడివైపుకు దూకారు. అలా కదిలామని వారు అనుకున్నారు, అంతే. వారి ఆలోచనలు కార్యరూపంలోకి రాకముందే కదిలారు శిష్యులు యిద్దరూ.

రెండు పల్టీలు, ఆ తర్వాత నీటిలోకి దూకే చేపపిల్లలా నాయకుడిమీదకు దూకాడు కళ్యాణుడు. రెక్కలు సాచిన రాబందులా వాడిమీదకు దూకుతూనే రెండుచేతులతో కత్తులెత్తి ముందుకు దూకుతున్న యిద్దరిని హతాశులను చేశాడు. తలపోటుకు తన కంఠం విరిగినట్లు విలవిలలాడుతూ నాయకుడు నిలువునా పడిపోయాడు. కత్తులను పైకెత్తిన యిద్దరి చేతులను గొంతులను కళ్యాణుడి రెండు చేతులు బిగించాయి. వారూ నేలకు కూలిపోయారు. చెంగున మరొక పిల్లిమొగ్గతో నిలిచిన కళ్యాణుడి చేతిలోకి వచ్చాయి రెండు విచ్చుకత్తులు! రెండు గంతులతో గోవిందుడి మీదకు ఉరుకుతున్నవారిమీదకు దూకాడు. రెండే రెండు విసుర్లకు వారి చేతులలోని ఆయుధాలు ఖంగుమంటూ నేలకు పడిపోయాయి. మరొక రెండు విసుర్లకు గూడలను రొమ్ములను చీలుస్తూ నెత్తుటిని వెలువరించాయి.

బల్లాలను దూసి సమర్ధునివైపు దూకుతున్న ముష్కరులమీదకు చాపచుట్టలా పడిపోయాడు గోవిందుడు. వారితోపాటు నేలకు పడిన మరుక్షణమే మెరుపులా లేచి నిలుచున్నాడు. ఒకడి బల్లెం ఆతడి చేతులలో మెరిసింది. పడినవారు దట్టీలకున్న కత్తులను లాగి మొదలుబెట్టారు. నాయకుడిలా ఉన్నవాడు గొంతునుపట్టుకుని బాధగా అలాగే పొర్లుతున్నాడు. మిగిలినవారు లేచి ఎదిరించడం మొదలుబెట్టారు. సమర్ధుని ఆలోచన మరిచిపోయారు. శిష్యులిద్దరినీ మట్టుబెట్టాలన్న పట్టుతో చుట్టూ కమ్ముకున్నారు. కళ్యాణుడి చేతిలో కత్తులు, గోవిందుని చేతిలో బల్లెం కనులకు కనిపించడంలేదు. అవి తిరుగుతుంటే వెలువడుతున్న ధ్వనులు మాత్రమే వినిపిస్తున్నాయి. మోకాళ్లమీద గుండ్రంగా తిరుగుతూ దుమ్ముతెరలు రేపుతూ ఉన్నచోట ఉండకుండా చిరుత గండుల్లా దూకుతున్నారు. బల్లాలతో, కత్తులతో వారిని పడగొట్టడానికి ప్రయత్నిస్తున్నవారి శరీరాలమీద క్రమక్రమంగా పెరుగుతున్న గాయాలు కనిపిస్తున్నాయి. పూచిన తంగేడుల్లా వాళ్ళ శరీరాలు వెలువరిస్తున్న ఎర్రని రక్తపు చెమ్మలు మెరుస్తున్నాయి. క్రమక్రమంగా చుట్టుముట్టిన ముష్కరుల ఉత్సాహం, ధైర్యం, శక్తి జావగారిపోతున్నాయి. క్రిందపడి పొర్లుతున్న ఆకారం ఎప్పుడు మాయమైందో, జాడ లేదు! పదినిముషాలలో ఒకటి, రెండు, మూడుకత్తులు ముక్కలైనాయి. మరొక రెండు పిడులు విరిగి నేలకు జారాయి. కూడబలుక్కున్నట్లు ఒకేసారి వెనక్కు దూకి పొదల్లోకి వారు మాయమైన మరుక్షణం బల్లెపు వీరులు కూడా అదేబాట పట్టారు.

క్రిందపడి పొర్లుతున్న ఆకారం నిజానికి పారిపోలేదు. పోరాటం ముమ్మరమై శిష్యులిద్దరూ చెలరేగుతున్నపుడే అది నెమ్మది నెమ్మదిగా వెనక్కుజరిగి బండరాళ్లవెనక్కు చేరుకుంది. పోరాటాన్ని ఒక కంట గమనిస్తూనే నెమ్మదిగా అడుగులేస్తూ సమర్ధరాముడు కూర్చున్న బండవెనక్కు సడి చేయకుండా చేరుకుంది. వీరాసనంలో కూర్చుని, వీరంగం వేస్తున్న శిష్యులను చూస్తున్నాడు ఆయన. శిష్యుల విద్యాపాటవాన్ని పరిశీలిస్తున్నట్లున్నాడు. తన వెనుకకు చేరుకున్న ఆకారాన్ని గమనించలేదో, గమనించనట్లు ఉన్నాడో తెలియదు. ఆ ఆకారం విసురుగా చేతిని పైకి లేపింది. పైకెత్తిన ఆ చేతిలో మూడు మూరలపొడవున విచ్చుకత్తి మెరిసింది. సమర్ధరాముడి కంఠాన్ని గురిచూసి బలంగా కరవాలాన్ని విసిరింది. అంతే!

ఎప్పుడు వచ్చిందో, ఎక్కడినుండి వచ్చిందో పెద్ద కొండముచ్చు ఒకటి అమాంతం ఆ ఆకారం మీదకు లంఘించింది. నాలుగు అడుగుల ఎత్తు, ఆరడుగుల పొడవు, నాలుగు మణుగుల బరువున్న ఆ మహా వానరం తన మీదకు దూకడంతోనే దబ్బున నేలకు కూలిపోయాడు వాడు. ఆ ధ్వనికి నిదానంగా తలతిప్పి వెనక్కు చూశాడు సమర్థరాముడు. ఆయన కంటికి చిత్రమైన దృశ్యం కనిపించింది. బండవెనుక పొదలమీద అడ్డంగా పడి ఉన్నాడు వాడు. ఎనిమిది బారల పొడవున్న తోకతో వాడి శరీరాన్ని చుట్టి, రెండుకాళ్ళతో వాడి చేతులను తొక్కిపట్టి వాడి మెడను రెండుచేతులతో పట్టుకున్నది ఆ మహామర్కటం. ఆ బరువుకు రొప్పుతూ శ్వాస తీసుకోడానికి ప్రయాస పడుతున్నాడు వాడు. పెనుగులాడుతున్న వాడి మెడను చొప్పదంటును విరిచినట్లు విరిచిపారేసింది ఆ మర్కటం. టప్పున విరిగిన మెడలోనుండి తెల్లని ఎముక బయటకు పొడుచుకువచ్చి అంచులవెంట బొట్లుబొట్లుగా రక్తం స్రవించడం మొదలుబెట్టింది. దాడికి వచ్చినవారిలో ఏడుగురు గాయాలతో పారిపోయారు. ఎనిమిదవవాడు, వారి నాయకుడు పరలోకానికి పోయాడు. సంభ్రమంతో చూస్తుండిపోయారు శిష్యులు. సాలోచనగా చూశాడు గురుదేవుడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS